తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# ప్రజల నుండి వచ్చిన సమస్యలకు అత్యంత ప్రాధాన్యత : కలెక్టర్



చిత్తూరు, జనవరి 21 ప్రభాతవార్త: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుండి సమస్యలపై వచ్చిన అర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలని కలెక్టర్ హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ హరినారాయణన్ కలెక్టరేట్ నుండి శనివారం ఎంపిడిఓలు, ఇజనీరింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు సంబంధించి 1,972 పనులు మంజూరు అయ్యాయన్నారు. ఈ పనులు చేపట్టడం కోసం 61 కోట్ల రూపాయలతో అంచనాలు రూపొందించడం జరిగిందన్నారు. ఇందులో ఇప్పటి వరకు 7 కోట్ల రూపాయల పనులు పూర్తి చేయడం జరిగిందన్నారు. ప్రజా ప్రతినిధులు ఏ సచివాలయ పరిధిలో వంద శాతం పర్యటనలు పూర్తి చేశారో ఆ సచివాలయం పరిధిలో వారు గుర్తించిన పనులను సత్వరం ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. అప్‌లోడ్ చేసిన పనులకు అనుమతులు వచ్చిన వెంటనే అంచనాలు తయరు చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఆర్‌డబ్ల్యుఎస్‌కు సంబంధించి 943 పనులు మంజూరు అయితే అందులో 105 పనులు పూర్తి అయ్యాయన్నారు. పంచాయతీరాజ్ శాఖ లో 794 పనులు పనులు మంజూరు అయితే ఇందులో ప్రస్తుతం 60 పనులు పూర్తి అయ్యాయన్నారు. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 66 పనులు మంజూరు అయితే అందులో ప్రస్తుతం 18 పనులు పూర్తి అయ్యాయన్నారు. అలాగే మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ద్వారా 118 పనులు మంజూరు అయితే అందులో 41 పనులు పూర్తి అయ్యాయన్నారు. పనులు ప్రారంభించని వారు సత్వరం పనులను ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో జడ్పీ సిఇఒ ప్రభాకర్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఇ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ నాగజ్యోతి, పంచాయతీరాజ్ ఇఇ చంద్రశేఖర్‌రెడ్డి, మున్సిపల్, ఎస్పీడిఎల్, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

# ఏ.పి.ఎన్జీవో అధ్యక్షుడుపై... వ్యక్తిగత దూషణలు సరికాదు

**-ఎ.పి.ఎన్జీవో సంఘంపై బురద జల్లడం ఆపకపోతే పరిణామాలు తీవ్రతరం**
**- ఎ.పి. ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు ప్రసాదరెడ్డి**



తిరుపతిరూరల్, జనవరి21 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సంఘ ఉద్యోగుల సంఘంపై ఎపిజిఇఎ నాయకులు బురద జల్లడం ఆపకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ఎ.పి.ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు వైజెపి ప్రసాదరెడ్డి హెచ్చరించారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.ఆర్.సూర్య నారాయణపై వ్యక్తిగత దూషణలకు పాల్పడటాన్ని ఎపిఎన్జీవోస్ సంఘం తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన బకాయిలపై సంఘం అధ్యక్షుడు కె.ఆర్. సూర్యనారాయణ నేతృత్వంలో గవర్నర్‌ను కలిస్తే తప్పేంటో చెప్పాలని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రథమ పౌరుడు గవర్నరు ప్రభుత్వ ఉద్యోగుల కలయికపై ఎపిజిఇఎ నాయకులకు ఉలుకుపాటు ఎందుకో చెప్పాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వంచే ప్రభుత్వ ఉద్యోగులకు సకాలంలో జీతభత్యాలు ఇప్పించాలనే కోరితే తప్పులేదని, ప్రజాస్వామ్యయుతమైన హక్కులో భాగమే అన్నారు. ఎల్లవేళల ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమాన్ని కోరే సూర్యనారాయనపై ఎపిజిఇఎ నాయకులు బండి శ్రీనివాస రావు వ్యక్తిగత విమర్శలు చేయడం బాధాకరం అన్నారు. ఇలాంటి నిరాధారమైన ఆరోపణలు చేస్తే ఉద్యోగులలో చులకనకావడం తప్ప మరేమి లేదన్నారు. కారుణ్య నియామకాల ద్వారా నియమితులైన ఉద్యోగులను కూడా కించపరిచే విధంగా బండి శ్రీనివాసరావు మాట్లాడటం, ఉద్యోగుల పట్ల ఆయనకు ఉన్న నిబద్ధత ఎమిటో తెలియ జేస్తుందన్నారు. ఎపిజిఇఎ నాయకులు శ్రీనివాసరావు రాజ్యాంగ అధినేత, గవర్నర్‌ను కోడి పుంజు, దున్నపోతుతో పోల్చడంపై తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఎ.పి. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుర్తింపు రద్దు కోసం హై కోర్టులో రెండు కేసులు వేసిన ఎపిజిఇఎ సంఘం ఎటువంటి ఉత్తర్వులు పొందలేదన్నారు. అక్రమ ఫిర్యాదుతో తమ సంఘ గుర్తింపును రద్దుకు ఎపిజిఇఎ కుటిల ప్రయత్నం చేస్తుందన్నారు. గుర్తింపు పొందిన ప్రభుత్వ సంఘాన్ని ఎలా రద్దు చేస్తారన్నారు. ఎపిఎన్జీఓ సంఘం మండల స్థాయి నుండి నిర్మాణక్రమంగా ఉన్నందున ఎపిజిఇఎ నాయకులకు బుద్ధి చెప్పటానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఎపిజిఇఎ సంఘ నాయకులకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి సిద్ధమై తామని హెచ్చరించారు. ప్రభుత్వ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్స్ కోసం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ, ప్రధాన కార్యధర్శి అస్కార రావుల నేతృత్వంలో భవిష్యత్ ప్రణాళికను రూపొందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మీపతి, జిల్లా కోశాధికారి మధు, సుబ్బరాయుడు, అరుణ, తిరుపతి తాలూక అధ్యక్షుడు, కార్యదర్శి కోటేశ్వరరావు, ప్రవీణ్, రాజేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శి విజయ్, మనోజ్, సుమన్, శివప్రసాద్, పురుషోత్తంరెడ్డిలు పాల్గొన్నారు.

# డిఎంహెచ్ఓ విచారణలోను...అదే సీన్ రిపీట్!

**వార్తకు స్పందన**

**-విచారణకు సైతం మద్యం సేవించి వచ్చిన వైద్యుడు రమేష్**
**-నివేదికను కలెక్టర్‌కు అందిస్తాం : డిఎంహెచ్ఓ**



వైద్యుడు రమేష్‌ను విచారిస్తున్న డిఎంహెచ్ఓ డాక్టర్ శ్రీహరి

తొట్టంబేడు, జనవరి 21 ప్రభాతవార్త : తొట్టంబేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్యులు విధి నిర్వహణలో ఉండగానే మద్యం సేవించడంపై వార్త దినపత్రికలో 'విధులు మాకొద్దు.. మందే మాకు ముద్దు" అన్న శీర్షికన వార్త ప్రచురితం కావడంతో దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి స్పందించారు. దీంతో ఈ కథనంపై సమగ్ర విచారణ చేపట్టినివేదికను అందజేయాలని జిల్లా వైద్యాధికారి (డిఎంహెచ్ఓ) డాక్టర్ శ్రీహరిని ఆదేశించడంతో శనివారం తొట్టంబేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చేరుకున్నారు. వార్త పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా విచారణకు వచ్చానని తెలిపారు. ఈసందర్భంగా ఆరోగ్య కేంద్రంలో ఉన్న సిబ్బందిని విచారించడంతో పాటు రికార్డులను పరిశీలించారు. వైద్యులు వద్ద ఉన్న రికార్డులను స్టాఫ్ నర్సులు వద్ద ఉన్నాయని గుర్తించినట్లు వివరించారు. విచారణలో ఓ వైద్యుడు ప్రవీణ్‌ను విచారించగా మద్యం సేవించినట్లు ఒప్పుకున్నట్లు తెలిపారు. అయితే మరో వైద్యుడు రమేష్ మాత్రం డిఎంహెచ్ఓ విచారణకు వచ్చారని తెలుసుకున్న ఆయన మరో గదిలోకి వెళ్ళిపోయాడు. కొద్దిసేపటి తర్వాత డాక్టర్ రమేష్ మద్యం సేవించి విచారణకు హాజరయ్యారు. దీంతో మళ్ళీ అదే సీన్ రిపీట్ అయినట్లు తెలిసింది. ఇద్దరు వైద్యులు ఆరోగ్య కేంద్రంలో ఉన్నారని ఒకరు గ్రామాల్లో ఫ్యామిలీ ఫిజిషియన్‌గా ప్రజలకు వైద్యసేవలు అందించాలని, మరొకరు వైద్యుడు ఆరోగ్య కేంద్రంలో ఉండి రోగులకు వైద్యసదుపాయాలు కల్పించాలని తెలిపారు. అయితే ఇద్దరు వైద్యులు కూడా శుక్రవారం మధ్యాహ్నం నుంచి లేరని విచారణలో తేలిందన్నారు. డాక్టర్ రమేష్ ప్రకాశం జిల్లా ఒంగోలు నుంచి ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని తొట్టంబేడు మండలం కాసరంకు వచ్చారని, తొట్టంబేడు ఆరోగ్య కేంద్రంలో ఉన్న వైద్యాధికారిణి బదిలీ అవడంతో డాక్టర్ రమేష్‌ను ఇక్కడకు మార్చారన్నారు. గతంలో కూడా వైద్యుడు రమేష్‌పై పలు ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. డాక్టర్ రమేష్ మద్యం సేవించి విచారణకు రావడాన్ని గుర్తించిన జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీహరి పోలీసులకు స్వయంగా ఫోన్‌చేసి ఎంత మద్యం సేవించారో తెలుసుకోవడానికి ఫోన్ చేశారు. అయితే ఎవ్వరు రాకపోవడంతో ఆయన వేచి చూసి నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు తెలిపారు. వైద్యులు రోగులకు అందు బాటులో ఉండాలని విధి నిర్వహణలో అలసత్వం వహించినా, మద్యపానం సేవించి వచ్చినా కఠిన చర్యలు తప్పని ఉద్యోగాలు ఉండవని తీవ్రంగా హెచ్చరించారు. ఆరోగ్య కేంద్రంలో ఉన్న సిబ్బంది పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. అయితే ఏది ఏమైనా వైద్యులపై చర్యలు తీసుకోవాలని పలువురు ప్రజలు కోరుతున్నారు. మరి కలెక్టర్ ఆలస్యం చేయకుండా ఏం చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

# ప్రశాంతంగా ముగిసిన... ప్రజాభిప్రాయ సేకరణ

తిరుపతి ప్రెస్‌క్లబ్,జనవరి 21 ప్రభాతవార్త: విశాఖపట్నంలోని ఏపిఎస్‌పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఈనెల 19 నుండి 21 వరకు మూడు రోజుల పాటు ఏపిఈఆర్సీ చైర్మన్ జస్టిస్ సివి.నాగార్జునరెడ్డి అధ్యక్షతన సభ్యులు పి.రాజగోపాల్‌రెడ్డి, ఠాకూర్ రామ్‌సింగ్‌లతో కలిసి నిర్వహించిన బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ శనివారంతో ప్రశాంతంగా ముగిసింది. ఈ సందర్భంగా జస్టిస్ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ గృహ, రాజకీయ, వ్యవసాయ, పారిశ్రామిక అలాగే వివిధ వర్గాలకు చెందిన వినియోగదారులుగానీ, వారి ప్రతినిధులు గానీ ఈ మూడు రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ సర్కిల్,డివిజన్ కార్యాలయాలతో పాటు,వ్యక్తిగతంగా 71 మంది వర్చువల్‌గా హాజరయ్యి పలు అంశాలపై సూచనలు, అభ్యంతరాలు, అభిప్రాయాలను తెలియచేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలోని 75 కేంద్రాల నుండి వర్చువల్‌గా నిర్వహించడం వలన మారుమూల గ్రామాల ప్రజలు సైతం వారి అభిప్రాయాలను వ్యక్తం చేయడానికి అవకాశం ఏర్పడిందన్నారు.ప్రజాభిప్రాయ సేకరణలో వచ్చిన అభిప్రాయాలపై మూడు విద్యుత్ సంస్థలకు చెందిన సిఎండిలు ప్రతి అభ్యంతదారునికి వివరంగా సమాధానం ఇవ్వడం జరిగిందన్నారు.ఇందులో చాలామంది ప్రజలు కమిషన్ పరిధిలో ఉన్న అంశాలు,అలాగే లేని అంశాలను కూడా ప్రస్తావించారని,కమిషన్ పరిధిలో లేని వాటిని సంబంధిత అధికారులకు తగు చర్యలు తీసుకోమని సూచిస్తామని,కమిషన్ పరిధిలో ఉన్న వాటిని పరిశీలించి తగు నిర్ణయం తీసుకుంటామన్నారు.అనంతరం ఇంధన శాఖ జాయింట్ సెక్రటరీ బివిపి.కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పారిశ్రామిక రంగం వేగంగా అభివృద్ధి చెందడానికి విద్యుత్ రంగం విద్యుత్ రంగం అత్యంత కీలకమని రాష్ట్ర ప్రభుత్వం గృహ, వాణిజ్య, పారిశ్రామిక రంగాలకు 24/7 నిరంతరాయంగా సరసమైన ధరలకు విద్యుత్‌ను అందిచడానికి మరియు వ్యవసాయ రంగానికి పగటి పూట 9 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను అందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.ఈ కార్యక్రమంలో విద్యుత్ పంపిణీ సంస్థలైన ఏపిఎస్‌పిడిసిఎల్, ఏపిఈపిడిసిఎల్, ఏపిసిపిడిసిఎల్ సిఎండిలు కె.సంతోషరావు, జె.పద్మజనార్ధన్‌రెడ్డి, ఏపిఈఆర్సీ సెక్రటరీ కె.రాజబాపయ్య, విద్యుత్ పంపిణీ సంస్థల డైరెక్టర్లు,ఇతర అధికారులు పాల్గొన్నారు.



# కొండపై డ్రోన్ కలవరం!

**-యాదృచ్ఛికమా! -భద్రత వ్యవస్థ లోపభూయిష్టమా**



**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:**
హిందువుల పవిత్రదేవుడు ఏడుకొండల వేంకటేశ్వరస్వామి కొలువైన తిరుమలకొండపై ఆలయాన్ని డ్రోన్‌తో చిత్రీకరించిన ఘటన ఆలస్యంగా సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తుండటంతో టిటిడి వర్గాల్లోనేగాక భద్రత విభాగాల్లో కలకలం రేపుతోంది. డ్రోన్ కెమెరాతో ఆలయం ముందు భాగం ఖాళీస్థలం నుంచి ఆలయానికి వెనుక వరకు భక్తుల కదలికలు, ఆలయపైభాగాన ఉన్న ప్రాంతం స్పష్టంగా కనిపిస్తుండటంతో ఎవరైనా యాదృచ్ఛికంగా చిత్రీకరించారా?లేక అనవసరంగా రాద్ధాంతం చేయడానికి తప్పుదారి పట్టేలా ఇలా చేశారా అనేది కలవరపెడుతోంది. ఓ మాటలో చెప్పాలంటే తిరుమలలో భద్రత వ్యవస్థలు లోపమేనని స్పష్టమవుతోంది. ఏడుకొండలపై ముఖ్యంగా వెంకన్న ఆలయం, స్వామివారి పవిత్రతను కాపాడటానికి శ్రీవారి భక్తులతో బాటు పోలీసు,టిటిడి విజిలెన్స్ విభాగాలు కీలకం. అలాంటిది నిత్యం భక్తుల కదలికలతో రద్దీగా ఉండే కొండపై ఆలయంపైభాగాన నిఘానేత్రాలకు దొరకకుండా డ్రోన్ కెమెరాను వినియోగించడం భద్రత లోపభూయిష్టమనే వ్యక్తమవుతోంది. అంతా సవ్యంగా జరిగిపోతే భద్రత పరంగా కఠినంగా వ్యవహరిస్తున్నామని ఢంబాలు కొట్టుకునే ఆయా విభాగాలు ఇంతపెద్ద తప్పిదం జరిగితే పొరబాటు ఎవరిదనేది మాత్రం ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఏర్పడిందనే శ్రీవారి భక్తుల నుంచి వినిపిస్తోంది. తిరుపతి నుంచి తిరుమలకు వచ్చే అలిపిరి తనిఖీ కేంద్రంలో నిశిత తనిఖీలు తరువాత కొండకు అనుమతినిస్తుంటారు. అలాంటిది గత రెండేళ్ళలో డ్రోన్‌కెమెరాలను ఎలా కొండపైకి తీసుకురాగలిగారనే అనుమానాలు అందరిలోనూ వ్యక్తమవుతున్నాయి. పైగా గతంలో అన్నమయ్యకాలినడక మార్గంలో చోటుచేసుకున్న ఈ తరహా పరిణామాలతో టిటిడి కూడా ఒకింత అప్రమత్తంగానే వ్యవహరిస్తోంది. తిరుమలలో 24గంటలూ 1200 కుపైగా సిసికెమెరాలు,వెయ్యిమంది వరకు సిబ్బంది పనిచేస్తున్నారు. సిసికెమెరాల పైభాగంలో డ్రోన్ ఎగిరిచిత్రీకరించినా కెమెరా కంటికి చిక్కదనేది భద్రత వర్గాల కథనం. ప్రత్యేకించి శేషాచలం కొండల్లో తిరుమల క్షేత్రంమొత్తం "నో ఫ్లయింగ్ జోన్"గా అమలుచేస్తున్నారు. ఇంత పకడ్బందీగా తిరుమలపై క్షణక్షణం నిఘా ఉన్నా భక్తుల ముసుగులో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఎప్పుడో ఓ డ్రోన్‌ను తిరుమలకొండపై వినియోగించి బేడి ఆంజనేయస్వామి ఆలయం వద్ద నుంచి గోవిందుడు కొలువైన ఆలయం పైభాగం, మహాద్వారం గోపురం, పడికావలి గోపురం, ధ్వజస్తంభం, ఆనందనిలయం, ఆలయానికి వెనుకవైపు పడమరభాగంలో శంఖుచక్రనామాలు ఉన్న నీటిఫౌంటైన్ వరకు పూర్తిగా చిత్రీకరించారు. దీనికి సమీపంలోనే లడ్డూవితరణశాల కూడా ఉంది. అయితే డ్రోన్‌చిత్రీకరించిన వ్యక్తులు అటుగా వెళ్ళలేదనే విషయం తెలుస్తోంది.పైగా విజిలెన్స్‌విభాగంలో సెక్యూరిటీ సిబ్బంది నుంచి పై స్థాయి అధికారుల వరకు అందరూ రాజకీయనేతల అండదండలతోనే డిప్యూటేషన్‌పై పోస్టింగ్‌లు తెచ్చుకున్నవారు. ఇంకా చెప్పాలంటే ఇక్కడే ఏళ్ళతరబడి పనిచేస్తుండటం కూడా కొంతవరకు విధి నిర్వహణలో నిక్కచ్చిగా వ్యవహరించలేకపోతున్నారనే విమర్శలు లేకపోలేదు. రెండేళ్ళు కరోనా తగ్గుముఖం తరువాత గత ఏడాది మార్చినెల నుంచి భక్తుల రద్దీ పెరిగింది. రెండేళ్ళముందు డ్రోన్ చిత్రీకరించారా?అనే ప్రశ్నలు కూడా టిటిడి భద్రత వర్గాల్లోనే వ్యక్తమవుతున్నాయి. కొండపై ఉన్న సిసికెమెరాల నిఘాలో సమాచారం గుర్తించాలి. కానీ నిఘావ్యవస్థ కూడా చిన్నచిన్న తప్పిదాలతో ఉదాసీనంగా వ్యవహరిస్తుందనడానికి డ్రోన్ కెమెరా చిత్రీకరణ నిదర్శనం. డ్రోన్ చిత్రీకరణ వీడియోపై చేతులుకాలాక ఆకులుపట్టుకున్న చందంగా సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్‌తో టిటిడి వర్గాలు కలవరపడుతుండటం కొసమెరుపు.

# రూ.4కోట్ల బడ్జెట్‌తో... శివయ్య సంబరాలు

**-గతం కన్నా భిన్నంగా వుండాలి -శివరాత్రి పనుల సమీక్ష**
**-దిశ దేశ సూచించిన శాసనసభ్యుడు**



శ్రీకాళహస్తీశ్వరాలయంలో శివరాత్రి సమీక్ష లో పాల్గొన్న చైర్మెన్ ఎంఎల్ఏ,ఇఓ, సభ్యులు

శ్రీకాళహస్తి,జనవరి 21 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాలను రూ.4కోట్లు ప్రాథమిక అంచనాలతో నిర్వహించుటకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటి వరకు జరిగిన పనులకు సంబంధించిన ప్రగతిపై శనివారం శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి ఆలయాధికారులు, ధర్మకర్తల మండలితో సమీక్షించారు. శాసనసభ్యుడు మాట్లాడుతూ ఈసారి శివయ్య పండగను గతం కన్నా భిన్నంగా నిర్వహించుటకు సహకరించాలని అధికారులకు సూచించారు. ఇప్పటి వరకు చేపట్టిన పనుల ప్రగతిపై ఒక్కొక్క అంశానికి సంబంధించి మధుసూధనరెడ్డి సమీక్షించారు. చైర్మెన్ అంజూరుతారక శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు అంశాలను క్షుణ్ణంగా ఎంఎల్ఏ సమీక్షించారు.పలు అంశాలు పనులకు సంబంధించి సభ్యుల ప్రశ్నలకు కార్యనిర్వహణాధికారి వికెసాగర్‌బాబు, ఇఇ మురళీధర్‌రెడ్డి, డిఇఇ శ్రీనివాసులురెడ్డిలు వివరించారు.

**నెల నెలా సమావేశాలెందుకు నిర్వహించరు?**

సమావేశానికి అధ్యక్షత వహించిన చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ తాను గత ఏడాది అక్టబర్‌లో సమావేశం నిర్వహణకు అజెండా ఇస్తే ఎందుకు సమావేశం ఏర్పాటు చేయలేదని అప్పటి అజెండాను ఇప్పుడు చర్చించాల్సి వచ్చిందని అధికారులను ప్రశ్నించారు. ఇక నైనా ప్రతి నెల సమావేశాలు నిర్వహించుటకు ఏర్పాట్లు చేయాలని చైర్మెన్ ఇఒను కోరారు.ఈ అంశాన్ని శాసనసభ్యుని దృష్టికి కూడా తెచ్చారు.

**అమోదించిన పలు అంశాలు:**

కొండమిట్టలోని సిద్దులయ్యస్వామి ఆలయం ఆధునీకరణ,గిరిప్రదక్షిణలోని పనస కోనను అభివృద్ధి పరచటం,వేయి లింగాల కోన కొండపై వెలసిన గోపురాన్ని కొత్తగా నిర్మించటం, మయూర తీర్థంకు మంచి రోజులు కల్పించటం, శుకబ్రహ్మాశ్రమం వద్ద కోనేరును ఆధునీకరించటం, ఎదురుసేవ మండపం వద్ద ప్రహరీ గోడ నిర్మించుట,ఉత్సవ మూర్తులు మోయు కూలీలకు డ్రెస్‌కోడ్ అమలు చేయటం,కోమటి వాని గుంట స్థలంలో నూతన కళ్యాణ మండపం నిర్మాణం చేపట్టడం,అనుబంధ ఆలయాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినపుడు ఇన్‌వెంటర్స్ ఏర్పాటు చేయటం,ఉత్సవాల్లో చెక్క పల్లకిలకు బదులు వెండి పల్లకిలను ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని తీర్మానించారు.

**స్వర్ణముఖి నదిలో శాశ్వత మండపాలు:**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో స్వర్ణముఖి నదిలో వ్యాస పౌర్ణమి సందర్భంగా, పంచమూర్తుల ఉత్సవాలకు, నదీహారతులకు సంబంధించి శాశ్వత మండపం, హారతులకు ఐదు వేదికలను నిర్మించాలని, యాగశాల,అష్టోత్తర కలశాభిషేకాలకు 108కలశాలను వెండివి తయారు చేయుట, ప్రత సోమ,శుక్రవారం పూలంగిసేవ నిర్వహించుటకు చర్యలు గైకొనుటకు స్వామి అమ్మవార్ల అంతరాలయం దర్శనం ఒక్కొక్కరికి రూ.500ల టిక్కెట్లు ఖరారు చేయటం జరిగింది. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో కన్నప్ప ఉత్సవానికి బండి కొత్తది తయారు చేయుట, ధూర్జటి కవి కాంస్య విగ్రహం ఏర్పాటు, 22 సంవత్సరాలుగా ఇక్కడ పారిశుద్ధ్య విభాగంలో పని చేస్తున్న 46 మంది పొరుగు సేవల సిబ్బందిలో వయస్సు పైబడిన వారి కుటుంబపోషణ నిమిత్తం అవకాశం కల్పించుట,తొట్టంబేడు మండలంలోని సింగమాల గ్రామంలో వెలసిన వీరభద్రస్వామి ఆలయంను శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా స్వీకరించుటకు, అలాగే శ్రీకాళహస్తి మండలంలోని అక్కుర్తి గ్రామం వద్ద ఉన్న మూటాలమ్మ, సంకట విమోచన ఆంజనేయ స్వామి దేవాలయాల ఆస్తులను స్వీకరించి అనుబంధంగా తీసుకొనుటకు తీర్మానం,తిరుపతి జిల్లాలోని అన్ని ప్రముఖ ఆలయాలకు శ్రీకాళహస్తీశ్వరుని ఆలయం నుంచి సారె అందించుటకు తీర్మానం,పంచభూత లింగాలకు కార్తీక మాసం శ్రీకాళహస్తీశ్వరుని నుంచి పట్టువస్త్రాలను అందించుటకు సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించారు.

**రూ.4కోట్లతో పనులు:**

సమావేశంలో ఆలయ కార్యనిర్వహణాధికారి వికె సాగర్‌బాబు మాట్లాడుతూ ఈ ఏడాది శివరాత్రి బ్రహ్మోత్సవాలను ప్రాథమిక అంచనాలు రూ.4కోట్లతో పనులు చేపట్టామన్నారు.29 పనులకు టెండర్లు పిలిచి పనులు చేపట్టినట్లు వివరించారు. సమావేశంలో ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు,ఇఓ వికె సాగర్‌బాబు,పాలక మండలి సభ్యులు పసల సుమతి, కొండూరు సునీత, రమాప్రభ, లక్ష్మీ, దాసరి జయమ్మ, ప్రత్యేకాహ్వానితులు చింతామణి పాండు, జూలుగంటి సుబ్బారావు, పాలమంగళం రవి, నీలా, శ్రీదేవి, దేవస్థానం అధికారులు ఎసి మల్లికార్జున్ ప్రసాద్, ఎఇఓ సతీష్‌మాలిక్, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ సుదర్శన్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఓటరు తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

***-ఓటుతోనే ప్రజామోదం పొందిన ప్రభుత్వం ఏర్పడుతుంది -జాతీయ ఓటర్ల దినోత్సవ బైక్ ర్యాలీ కలెక్టర్ వెంకటరమణారెడ్డి***

తిరుపతిరూరల్, జనవరి21 ప్రభాతవార్త: యువత దేశానికి వెన్నుముఖ లాంటివాళ్ళని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడు ఓటు నమోదు చేసుకుని, ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వెంకట రమణారెడ్డి సూచించారు. జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం పాత మునిసిఫల్ కార్యాలయం వద్ద బైక్ ర్యాలీని కలెక్టర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ ఎస్ ఎస్ ఆర్ 2023 అనేది గత సంవత్సరం ఎవరైతే ఓటు హక్కు కోసం ధరఖాస్తు చేసుకున్నారో వాళ్ళందర్ని పరిశీలించి, ప్రతి సంవత్సరం జనవరి 5న ఓటరు జాబితాను ప్రచురించడం జరుగుతుం దన్నారు. కొత్తగా ఎవరైతే ఓటరుగా నమోదై ఉంటారో వారికి ఎలక్సన్ కమీషన్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు జనవరి 25వ తేదీన నేషనల్ ఓటర్స్ డే రోజున ఓటరు ఐడి కార్డులు అందజేస్తామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 18,19 సంవత్సరాలు నిండిన యువత చాలా మంది ఇంకను ఓటు నమోదు చేసుకోలేదన్నారు. ఓటు హక్కు ద్వారా సరైన నాయకుణ్ణి ఎన్నుకోగలిగితే దేశం కూడా ప్రపంచ దేశాలతో పాటు ముందుకు వెళ్ళుతుందన్నారు. ఓటరు దినోత్సవం రోజును ఓటరు కార్డులు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో శ్రీనివాసరావు, మునిసిఫల్ డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వరరెడ్డి, అర్బన్ తహశీల్థార్ వెంకటరమణ, ఆర్.ఐ. రామచంద్ర, వివిధ శాఖల అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తి మున్సిపల్ ప్రత్యేకాధికారిగా రామారావు



శ్రీకాళహస్తి,జనవరి 21 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి మున్సిపల్ ప్రత్యేకాధికారిగా శ్రీకాళహస్తి ఆర్‌డిఓ కె.ఎస్.రామారావును నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.శ్రీకాళహస్తి మున్సిపల్ ప్రత్యేకాధి కారిగా తిరుపతి ఆర్‌డిఓ సుమారు 3 సంవత్సరాలు వ్యవహరించారు. జిల్లాల విభజన తరువాత సుమారు మూడు నెలలుగా శ్రీకాళహస్తి మున్సిపాలిటికి ప్రత్యేకాధికారి లేకుండా కొన్ని అంశాలు ఆగాయి. పలు పరిశీలనల తరువాత ప్రభుత్వం శ్రీకాళహస్తి ఆర్‌డిఓ రామారావును నియమించారు. గతంలో కౌన్సిల్ అంశాలను ప్రత్యేకాధికారి వద్దకు తిరుపతికి సిబ్బంది పరుగులు తీసేవారు. ప్రస్తుతం శ్రీకాళహస్తి ఆర్‌డిఓ రామారావును నియమించటంతో సిబ్బందికి తిప్పలు తప్పాయి.ఏ అంశం అయినా వెంటనే చర్చించి నిర్ణయాలు తీసుకునేందుకు అవకాశం ఉంది. శ్రీశైలం ఇఒగా సమర్థవంతంగా పని చేసిన ఆయన ఇటీవల శ్రీకాళహస్తి ఆర్‌డిఓగా వచ్చారు. ఆయన శ్రీకాళహస్తీశ్వరాలయ ఇఒగా వస్తారని భావించారు.కానీ ఎందుకో ఆ నిర్ణయం అమలు జరగలేదు. ప్రస్తుతం శ్రీకాళహస్తి ఆర్‌డిఓగా శ్రీకాళహస్తి మున్సిపల్ ప్రత్యేకాధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం రామారావు సెలవులో ఉన్నారు. ఫిబ్రవరి 1వ తేది బాధ్యతలు స్వీకరించవచ్చునని భావిస్తున్నారు.

# శివయ్య దర్శనం కోసం జనం తహ తహః

## -హద్దు అదుపులేని అడ్డదారి దర్శనాలు -తగ్గని రద్దీ, 30 వేల మంది దర్శనం

శ్రీకాళహస్తి,జనవరి 21 ప్రభాతవార్త : ముల్లోకాల్ని ఏలే ముక్కంటీశుని దర్శనం కోసం దేశ నలుమూలల నుంచే కాకుండా విదేశాల నుంచి భక్తులు తండోపతండాలుగా వస్తున్నారు.సాధారణంగా తై అమావాస్య సందర్భంగా ఆలయానికి భక్తులు పోటెత్తుతారు.ఈ నేపధ్యంలో శనివారం అధికారులు అందించిన సమాచారం మేరకు 3వేల మంది దర్శనం చేసుకున్నట్లు సమాచారం అలాగే రాహుకేతుదోష నివారణ పూజలు 6వేలు జరిగాయి. అధికారులు, ధర్మకర్తల మండలి సమీక్షా సమావేశంలో తలము నలకలు కాగా దళారులు, అడ్డదారి దర్శనాలతో సామాన్య భక్తుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. అంతేకాక స్వామిగర్భాలయంలో



కొందరుదళారులుతమహావానడపగా సామాన్య భక్తులు భోళాశంకరుని కనురెప్పపాటు దర్శనం కోసం తిప్పలు పడ్డారు.

***ఎవరైనా విఐపినే రాజమార్గంలో దర్శనాలే:***

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఇటీవల కాలంలో దళారుల దందా పెరిగింది. ఉద్యోగులుకాని వారు. ఎలాంటి సంబంధం లేని వారి పెత్తనం పెచ్చు పెరిగింది. ఇక్కడ దళారుల పరిస్థితి ఎలా మారిందంటే భక్తి భావంతో వచ్చిన భక్తులు గంటల తరబడి క్యూలైన్లలో భోళాశంకరుని దర్శనం కోసం నిరీక్షిస్తుంటే కాసులు వసూలు చేసుకునే వారు 'రాజమార్గం' గుండా తాము వ్యాపార లావాదేవిలు చేసుకున్న వారు 'విఐపి' అంటూ తీసుకెళుతుంటే పట్టించుకునే దిక్కులేదు. ఇక భక్తుల మొర ముక్కంటీశునికే ఎరుక. సాక్షాత్తు పిఆర్ఓ కార్యాలయం వద్దనే దళారులు తిష్ట వేసి 'సుదర్శనం సత్వర దర్శనం అంటూ' పార్టీలను ఫిక్స్ చేసుకొని రేటు ఖరారు చేసుకుంటున్నారు.

## సుధాలక్ష్మికి డాక్టరేట్ ప్రధానం



తిరుపతి (విద్య), జనవరి 21, ప్రభాతవార్త శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ కంప్యూటర్ సైన్స్ విభాగం పరిశోధన విద్యార్థిని ఎస్. సుధాలక్ష్మికి డాక్టరేట్ ప్రధానం చేసింది. ఆ విభాగం ఆచార్యులు ప్రొఫెసర్ ఎం. ఉషారాణి మార్గదర్శకంలో ఏ నావెల్ అండ్ ఎఫీషియెంట్ హైబ్రిడ్ అప్రోచెస్ ఫార్ మల్టీ డాక్యుమెంట్ టెక్స్ట్ సమ్మరైజేషన్ యూజింగ్ డీప్ లర్నింగ్ మోడల్స్ అనే అంశం పై పరిశోధన గ్రంథం సమర్పించినందుకు ఆమెకు డాక్టరేట్ ప్రధానం చేసినట్లుకంట్రోలర్ఆఫ్ఎగ్జామినేషన్స్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

## ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కి ఎంపికైన నిహారిక

తిరుపతి (విద్య), జనవరి 21 ప్రభాతవార్త :



శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాలకు చెందిన ప్రథమ సంవత్సరం సిఇసి గ్రూపుకు చెందిన నిహారిక జనవరి 3వ తేది నుండి 8వ తేది వరకు జరిగిన రెండవ జాతీయ స్థాయి కర్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో సిల్వర్ మెడల్ కైవసం చేసుకుని ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కి ఎంపికైనట్టు జమ్ము కాశ్మీర్ స్పోర్ట్స్ కౌన్సిల్ వారు ఉత్తర్వులు జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటి సారిగా వింటర్ ఖేలో ఇండియాకి టిటిడి విద్యా సంస్థలకు చెందిన విద్యార్థిని ఎంపిక అవ్వడం పట్ల జేఈవో సదా భార్గవి, డిఈఓ డా. భాస్కర్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డా. భువనేశ్వరి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. విద్యార్థినిని, శిక్షణ ఇచ్చిన సాయి సుమతిని కళాశాల ప్రిన్సిపాల్ డా. భువనేశ్వరి అభినందించి, ఫిబ్రవరి 10వ తేది ఉంచి 12వ తేది వరకు జరిగే వెస్ట్ జమ్మూ కాశ్మీర్‌లోని గుల్ మార్గ్ ప్రాంతంలో ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో రాణించి, గోల్డ్ మెడల్ సాధించాలని కోరారు. కళాశాల అధ్యాపకులంతా నిహారికని అభినందించారు.

## రోల్ బాల్ చాంపియన్‌షిప్ పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే

తిరుపతి (క్రీడ), జనవరి 21 ప్రభాతవార్త :



తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణంలో నిర్వహించబడే రాష్ట్ర స్థాయి రోల్ బాల్ పోటీలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ పోటీలకు రాష్ట్ర నలుమూలల నుండి అన్ని జిల్లాల క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ రాష్ట్ర స్థాయి రోల్ బాల్ పోటీలను తిరుపతి శాసన సభ్యులు కరుణాకర్ రెడ్డి ప్రారంభించారు. ఈ చాంఫియన్‌షిప్ పోటీలకు అధ్యక్షులుగా తిరుపతి జిల్లా విద్యాశాఖాధికారి డా. డి.శేఖర్ నిర్వహించారు. తిరుపతి శాసన సభ్యులు కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ తిరుపతి రాష్ట్ర స్థాయి పోటీలు మాత్రమే కాకుండా జాతీయ స్థాయి పోటీలు నిర్వహించడానికి అనువైన క్రీడా మైదానాలు కల్గివున్నాయి. ఈ కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎస్. బాబు, 32 వార్డు కార్పొరేటర్ ఆర్. వెంకటేశ్వర్లు, అండర్ 19 స్కూల్ గేమ్స్ కార్యదర్శి జయరామయ్య, ఆంధ్రప్రదేశ్ రోల్ బాల్ వైస్ ప్రెసిడెంట్ జి. ప్రతాప్, కార్యదర్శి ఏ. అనిల్, టోర్నమెంట్ టెక్నికల్ చైర్మన్ విజి ప్రేమ్‌నాథ్, టోర్నమెంట్ డైరెక్టర్ శ్రీమన్నారాయణ, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు

తిరుపతి క్రైం, జనవరి 21 ప్రభాతవార్త :



జిల్లా వ్యాప్తంగా జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా ఆటో డ్రైవర్లకు, వాహనదారులకు, ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలపై, రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా ఎస్పి పరమేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు అవగాహన కల్పించారు. తిరుపతి ట్రాఫిక్ పోలీసు విభాగం వారు, తిరుపతి జిల్లా రోడ్ రవాణా శాఖ కలిసి సంయుక్తంగా జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాలు - 2023 పై అవగాహన సదస్సును శనివారం సాయంత్రం శ్రీ రామచంద్ర పుష్కరణి వద్ద ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ డిఎస్పీ కాటమరాజు మాట్లాడుతూ తిరుపతి నగరంలో ఉన్న ప్రజలకు, డ్రైవర్లకు , వాహనదారులకు ట్రాఫిక్ నియమ నిబంధనపై అవగాహన ఉండాలని అలాగే హెల్మెట్, సీట్ బెల్ట్ వెనుకున్నాకే ప్రయాణించాలని, ప్రతి ఒక్కరూ స్పీడ్ లిమిట్ పాటించి నిర్దేశించిన స్పీడ్‌లోనే ప్రయాణిచేలా తప్ప అంతకు మించి స్పీడ్‌తో ప్రయాణించినట్లైతే విలువైన ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా రవాణా శాఖ అధికారి కె. సీతారామిరెడ్డి, తిరుపతి ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సి. భాస్కర్‌రెడ్డి,మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్స్ శ్రీనివాస రావు, కుసుమ, తిరుపతి ట్రాఫిక్ ఎస్ఐలు, ట్రాఫిక్ సిబ్బంది, రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## ఛాయా మార్తాండ శనైశ్చర ఆలయంలో విశేష పూజలు

రామచంద్రాపురం, జనవరి 21 ప్రభాతవార్త:



తై అమావాస్యను పురస్కరించుకునిశనివారం రాయల చెరువు సమీపంలో గల ఛాయామార్తండ ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఉదయం శనైశ్చర స్వామి వారికి ఆలయ వ్యవస్థాపక ధర్మాధికారి ఉంగరాల సుబ్రమణ్యశర్మ తైలాభిషకం, వంజావృతాభిషేకం నిర్వహించారు. అనంతరం గోవుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో శాంతి హోమం నిర్వహించి స్వామి వారిని వస్త్ర, పుష్ప, బంగారు ఆభణాలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయంలో అన్నదానం కార్యక్రమం చేపట్టారు. చిట్టత్తూరుకు చెందిన మునీశ్వరయ్య భక్తబృందంచే భజనలు చేశారు.

## భక్తులతో కిటకిటలాడిన కల్యాణవేంకటేశ్వరుని ఆలయం

నారాయణవనం, జనవరి 21 ప్రభాతవార్త :



నారాయణవనంలోని కల్యాణవెంకటేశ్వరుని ఆలయంలో శనివారంతో భక్తుల సందడితో ఆలయం కిటకిటలాడింది. అంతకు ముందు అమ్మవారిని,స్వామి వారిని సుప్రభాత సేవలతో మేల్కొలిపి నెయ్యి వంటి సుగంధద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం స్వామి, అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో సుమనోహరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని నెయ్యి దీపాలను వెలిగించారు. టిటిడి అధికారులు భక్తులకు అమ్మవారి ప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు నాగరాజు, అర్చకులు శ్రీధర్‌భట్టాచార్య, శ్రీనివాసభట్టాచార్య, నరసింహారాఘవ భట్టాచార్య, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆలయాల్లో ఘనంగా తై అమావాస్య పూజలు

నారాయణవనం, జనవరి 21 ప్రభాతవార్త :



మండలకేంద్రంలో అవదూతగా వెలసిన తాతాసొరకాయుల స్వామి, శింగిరికోన శ్రీదేవి,భూదేవి సమేత లక్ష్మీనరసింహా స్వామి, కైలాసనాధకోనలో వెలసిన ఆలయాల్లో శనివారం తై అమావాస్య పూజలను ఘనంగా నిర వ్హించారు. స్థానిక భక్తులతో పాటు తమిళనాడుకు చెందిన వేలాదిమంది భక్తులు ధర్శనం చేసుకున్నారు. భక్తులు టెంకాయహారతులు, నైవేద్యం సమర్పించుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

## ప్రయాణికులకు భద్రతతో కూడిన రహదారులు

– భద్రత కమిటీ తిరుపతి పట్టణంలో పలు రోడ్లు పరిశీలన

తిరుపతిరూరల్, జనవరి21 ప్రభాతవార్త:



ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు, ప్రమాదాలు కలగకుండా ఉండేలా భద్రతతో కూడిన రహదారులు ఉండేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ వెంకట రమణారెడ్డి ఎన్‌హెచ్ 205 ప్రాజెక్టు డైరెక్టర్ కుమారన్‌ను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్, జిల్లా రహదారి భద్రత కమిటీ ఆదేశాల మేరకు జిల్లా ఆర్ అండ్ బి ఇంజనీరింగ్ అధికారి సుధాకర్‌రెడ్డి, జిల్లా రవాణాశాఖ అధికారి కె.సీతారామిరెడ్డి, ట్రాఫిక్ డియస్పీ విజయశేఖర్, దుర్గప్రసాదరెడ్డి, తమిళ అరసన్ మేనేజర్ సంయుక్తంగా క్షేత్రస్థాయిలో సి.మల్లవరం జంక్షన్ నుండి రామానుజపల్లి, రామచంద్రపురం జంక్షన్, తనపల్లి, తిరుచానూరు జంక్షన్‌ను పరిశీలించి జంక్షన్స్ వద్ద అవసరమైన చోట బ్లింకర్స్, సైన్‌బోర్డ్స్, లైటింగ్‌ను ఏర్పాటు చేయటానికి ప్రతిపాదనలు సిద్దం చేసారు. అనంతరం జిల్లా కలెక్టర్‌ను కలిసి జాయింట్ ఇన్‌స్పెక్షన్ విషయాలను తెలియజేయగా జిల్లా కలెక్టర్ ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా ప్రమాదాలు జరగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని ఎన్‌హెచ్ 205 ప్రాజెక్టు డైరెక్టర్ జనకుమారన్‌ను ఆదేశించారు.

## తిరుచ్చిపై శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు

చంద్రగిరి, జనవరి 21 ప్రభాతవార్త:



శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు తిరుచ్చి వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ఆలయ అర్చకులు వేకువజామున స్వామి వారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలను ఆగమోక్తంగా నిర్వహించారు. భక్తుల గోవింద నామ స్మరణల నడుమ స్వామి వారు తన దేవేరులతో ఆలయ తిరుమాడ వీధులలో తిరుచ్చిపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గురుమూర్తి, సూపరింటెండెంట్ మునిచెంగల్రాయులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, అర్చకులుప్రభాకర్, శ్రీనివాసాచార్యులు, లక్ష్మీరాజేష్, జమేధర్‌చిరంజీవులు, తదితరులు పాల్గొన్నారు.

## యువగళం మహా పాదయాత్ర విజయవంతం చేయాలి

వడమాలపేట, జనవరి 21 ప్రభాతవార్త:



తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ ఈ నెల 27వ తేదీ నుంచి తలపెట్టిన మహా పాదయాత్ర విజయవంతం కావాలని వడమాలపేట మండలంలోని ఆ పార్టీనాయకులు ప్రసన్న వెంకటేశ్వరస్వామికి కొబ్బరి కాయలు కొట్టారు. శనివారం తెలుగు మహిళ ఆధ్వర్యంలో అప్పలాయగుంటకు చేరుకున్న నాయకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, 101 కొబ్బరికాయలు కొట్టారు. అప్పలాయగుంట కమిటీ అధ్యక్షులు రఘు, వెంకటయ్య, హేమావతి, ధనలక్ష్మి, నాగరత్న, శేషాద్రినాయుడు, గురునాథంశెట్టి, మునిశేఖర్, మోహన్, ఉమాపతి, మురళీరెడ్డి, వినోద్, చైతన్య, వివేక్, శివలాల్, గాలి లక్ష్మి, మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## అంగరంగ వైభవంగా జల్లికట్టు సంబరాలు

తిరుపతి (క్రీడా), జనవరి 21, ప్రభాతవార్త :



గాదంకి గ్రామంలో జల్లికట్టు సంబరాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎద్దులను శుభ్రంగా కడిగి, రంగులు వేసి, కొమ్ములకు, గంటలు కట్టి, కొమ్ములపైన దేవుళ్ళ పటాలతో అలంకరించి పూజలు నిర్వహించి, ఎడ్లబండి కట్టి అలంకారం చేసారు. అనంతరం ఎద్దులను జల్లి కట్టుకు సిద్ధం చేసి యువకులు ఎద్దులను నిలువరించేందుకు ప్రయత్నించారు. ఈ వేడుకలను తిలకించేందుకు చుట్టుపక్కల ఉన్న గ్రామాల నుంచి భారీ మొత్తంలో జనాభా చేరుకున్నారు.

## వ్యాసరచనలో జిల్లా స్థాయిలో ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రశంస

నగరి, జనవరి 21 ప్రభాతవార్త:



భారతీయ సంస్కృతిపై శ్రీ సత్య సాయి సేవా సదన్ వారు సత్యసాయి 95వ జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో జూనియర్ కళాశాల, ఆంగ్ల మాద్యమం విభాగంలో నగరి పట్టణం సూర్య జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థిని కె.సి.ప్రతిమ(16) జిల్లాస్థాయిలో మొదటి స్థానం సాధించింది. 4 వేల మంది విద్యార్థులు ఈ పోటీలకు హాజరు కాగా డిగ్రీ, జూనియర్, పాఠశాల స్థాయిలో ఆంగ్ల, తెలుగు మాధ్యమాల్లో 36 మందిని ఎంపిక చేశారు. వీరిలో జూనియర్ కళాశాల, ఆంగ్ల మాద్యమం విభాగంలో కె.సి.ప్రతిమ జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం, సురేఖ ద్వితీయ స్థానం సాధించారు. విద్యార్థులను శనివారం స్థానిక బాలాజీ గోల్డెన్ సిటీలో నగరి సత్యసాయి సేవా సమితి వారు నిర్వహించిన కార్యక్రమంలో అభినందించారు. అనంతరం నగరి మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి షీల్డ్, ప్రశంసా పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సత్యసాయి సధన్ అధ్యక్షుడు మధు,జిల్లా కన్వీనర్ శేష నారాయణ, నగరి కన్వీనర్ మురళీధర్, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఐఎన్‌టీఎస్‌వో ఒలంపియాడ్ శ్రీ చైతన్య హవా

పుత్తూరురూరల్, జనవరి 21 ప్రభాతవార్త:

జాతీయ స్థాయి పరీక్షల్లో పుత్తూరు శ్రీ చైతన్య విద్యార్థులు 127 మంది లెవెల్-2కి అర్హత సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రశంస కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవికిరణ్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను అభినందించారు.కార్యక్రమంలో డీన్ తిరు, ప్రైమరీ ఇన్‌చార్జి, తదితర ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## నేడు మెగా ఉచిత కంటి వైద్య శిబిరం

కేవీబీ పురం, జనవరి 21 ప్రభాతవార్త:

మండల కేంద్రమైన కేవీబీ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శ్రీ పద్మావతి మహిళా అభ్యుదన సంఘం ఆధ్వర్యంలో మెగా ఉచిత కంటి వైద్య శిబిరం జరుగుతుందని క్యాంప్ నిర్వాహకులు తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు ఈ శిబిరం జరుగుతుందని, కావున కంటి జబ్బులు ఉన్న వాళ్ల శిబిరంలో పాల్గొనాలన్నారు. ఈ శిబిరానికి వచ్చే వారు ప్రతి ఒక్కరు ఆధార్‌కార్డు తీసుకురావాలని నిర్వాహకులు తెలిపారు. కావున మండల ప్రజలందరూ కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

## ప్రజాసేవలో ప్రథమ పౌరుడు

రేణిగుంట, జనవరి 21 ప్రభాతవార్త:



రేణిగుంట మేజర్ పంచాయతీ సర్పంచ్ నాగేషం శనివారం రేణిగుంట పంచాయతీలోని అన్ని ఓవర్‌హెడ్ నీళ్ళ ట్యాంకులను పారిశుధ్య కార్మికుల చేత దగ్గరుండి శుభ్రం చేయించారు. అన్ని కాలువల్లో, కల్వర్టుల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. మోటార్లను పరిశీలించి పని చేయని వాటిని మరమ్మతులు చేయించారు.ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, రేణిగుంట మండల వైసీపీ ఇన్‌చార్జి పవిత్రరెడ్డి, ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి సహకారంతో రేణిగుంట పంచాయతీని ఉత్తమ పంచాయతీగా తీర్చిదిద్దడానికి తనవంతు కృషి చేస్తానని ప్రభాతవార్త ప్రతినిధికి తెలిపారు. నీటిని వృథా చేయకుండా గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

## నవశకం సర్వేలో లబ్దిదారులకు ఆరోగ్యశ్రీ కార్డులు

తిరుపతిరూరల్, జనవరి21 ప్రభాతవార్త:



2019లో నవశకం సర్వేలో అర్హులైన లబ్దిదారులకు ఆరోగ్యశ్రీ కార్డులు అందజేయడం జరిగిందని, 2019 తర్వాత జన్మించిన పిల్లలకు ఆరోగ్యశ్రీ కార్డులో చేర్చేందుకు గ్రామ, వార్డు సచివాలయ శాఖ అవకాశం కల్పించిందని కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోగ్యశ్రీ కార్డులో కుటుంబ సభ్యుల యొక్క గ్రూపు ఫోటో అప్డేట్ చేసుకునుటకు, ఆరోగ్యశ్రీ కార్డు పొగోట్టుకున్నవాళ్ళకు రీ ప్రింట్ కొరకు కూడా అవకాశం కల్పించబడినట్లు తెలిపారు. ప్రజలు తమ గ్రామ వార్డు సచివాలయాన్ని సంప్రదించి, తగిన రుసుం చెల్లించి సేవలు పొందాలని సూచించారు. గతంలో ఆరోగ్యశ్రీ కార్డులేని వాళ్ళు కింది అర్హతలు ఉంటే కొత్తకార్డు కొరకు నమోదు చేసుకోవచ్చునని తెలిపారు.

## భరద్వాజతీర్థంలో అన్నదానం

శ్రీకాళహస్తి, జనవరి 21 ప్రభాతవార్త :



తై అమావాస్య సందర్భంగా భరద్వాజతీర్థంలో దివంగత గరికపాటిరామచంద్రయ్య కుమారులు గరికపాటి రమేష్‌బాబు, గరికపాటి సుధాకర్ బాబు గరికపాటిచంద్రశేఖర్,గరికపాటి రమేష్‌బాబులు విచ్చేసిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు జగదీష్, భాస్కర్,రామకృష్ణ,లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

## కాణిపాకంలో ఘనంగా తై అమావాస్య వేడుకలు

కాణిపాకం, జనవరి 21 ప్రభాతవార్త:



ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో శనివారం "తై అమావాస్య" వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఆలయంలో తై అమావాస్య సందర్భంగా పలు కార్యక్రమాలను నిర్వహించారు. ఈకార్యక్రమానికి కాకర్లవారిపల్లెకు చెందిన పట్టాభినాయుడు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈసందర్భంగా దేవస్థానం వారిచే ఉదయం స్వామివారికి అర్చకులు సంప్రదాయబద్దంగా పంచామృతాభిషేకం నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే రాత్రి స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను అలంకారం మండపంలో వుంచి ప్రత్యేకపూజలతో ధూపదీపం నైవేద్యాలను సమర్పించిన అనంతరం అలంకరించిన ప్రత్యేక పల్లకిపై వుంచి మంగళవాయిద్యాల నడుమ గ్రామ పురవీధుల గుండా ఘనంగా ఊరేగించారు.ఈకార్యక్రమంలో ఆలయ సూపరెండెంట్ శ్రీనివాస్, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాబు వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు, పరిసర గ్రామాల ప్రజలు,ఉభయదారులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# లింగ సమానత్వంపై యువకుల్లో అవగాహన

తిరుపతి (క్రీడా), జనవరి 21, ప్రభాతవార్త : ఐక్యరాజ్య సమితి నివేదిక ప్రకారం, లింగ అసమానతలు పూర్తిగా నిర్మూలించి, సమసమాజ నిర్మాణం దాదాపు 300 సంవత్సరాలు పడుతుందని అభిప్రాయపడిన నేపథ్యంలో మహిళా అధ్యయన విభాగం, కేంద్రం, యువకులలో లింగ అసమానతలపై అవగాహన కల్పించే నిమిత్తమై రోల్ ఆఫ్ బాయ్స్ ఇన్ జెండర్ ఈక్వాలిటీ అనే అంశం పైన పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వర్క్ షాప్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా మహిళా అధ్యయన విభాగాధిపతి డా. నీరజ మాట్లాడుతూ మహిళా సాధికారతలో పురుషులు భాగస్వాములు కావాలని, మహిళల సమస్యల పట్ల పురుషులు అవగాహన ఏర్పరచుకుని, పరస్పర సహకారం అందించినప్పుడే త్వరితగతిన అసమానత నిర్మూలన జరుగుతుందని అభిప్రాయపడ్డారు. నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో గణాంకాల ప్రకారం




మహిళలు అత్యధికంగా తమ భాగస్వామి చేతుల్లో భౌతికంగా లేదా లైంగికంగా హింసను ఎదుర్కొంటున్నారని చెబుతున్నాయని, పురుషాధిక్యతను చాటుకోవడం కోసం మహిళల గౌరవానికి భంగం కలిగించడం శోచనీయమని పేర్కొన్నారు. అందుకే ఇలాంటి అవగాహన కార్యక్రమాలు యువకుల ఆలోచన ధోరణిలో మార్పు తీసుకురావడానికి ఎంతోకీలక పాత్ర పోషిస్తాయని అభిప్రాయపడ్డారు. జెండర్ స్టీరియోటైప్ ఆటిట్యూడ్స్ వలన కేవలం మహిళలే కాకుండా పురుషులు కూడా ఎన్నో రకాల సమస్యలను ఎదుర్కోవల్సి వస్తున్నందున

ఈ విషపూరిత పితృస్వామ్య భావజాలాన్ని విడనాడి సమసమాజ స్థాపన దిశగా స్త్రీ పురుషులు ఇరువురు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాలలోని విమెన్ ఎంపవర్మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ రాధిక, అధ్యాపకులు, మహిళా అధ్యయన కేంద్ర రీసెర్చ్ అసిస్టెంట్ ప్రీతి, పురుష విద్యార్థులు పాల్గొన్నారు.

# కన్నుల పండువగా కైలాసనాథుని లోబావి ఉత్సవం






**శ్రీకాళహస్తి,జనవరి 21 ప్రభాతవార్త**

దక్షిణ కైలాసంలో వెలసిన భోళాశంకరుని లోబావి ఉత్సవం కన్నుల పండువగా జరిగింది.ఏడాదిలో ఒక్కసారి ఇక్కడకు తై అమావాస్య సందర్భంగా ఈ ఉత్సవాన్ని మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముందు నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం ఆలయంలోని అలంకార మండపంలో స్వామి అమ్మవార్ల ఉత్సవర్లను చక్కగా అలంకరించారు. మేళతాళాలు మంగళవాయిద్యాలతో సన్నిధివీధి, శివయ్యసదన్‌ల మీదుగా స్వామి అమ్మవార్లను వేలాది మంది భక్తులు వెంటరాగా లోబావి (భరద్వాజ తీర్థం) వద్దకు చేర్చారు.అక్కడ భరద్వాజేశ్వరుని ఆలయం ఎదురుగా ఉత్సవర్లను ప్రతిష్టించి వేద పండితులు వేదమంత్రాల్ని ఘోషిస్తుండగా శాస్త్రోక్తంగా ఆలయ అర్చకులు షోడషాభిషేకాలు నిర్వహించారు. గతంలో గర్భగుడికి సమీపంలో ఏర్పాటు చేసి అభిషేకాలు నిర్వహించేవారు. శనివారం భక్తుల సంఖ్య అధికంగా ఉండటంతో దర్శించుకోవటానికి వీలు లేనందువల్ల అందరికి సుదర్శనం కోసం ఇఓ వికె సాగర్‌బాబు అర్చకులకు ఆదేశించారు. భరద్వాజతీర్థంలో ఉన్న మండపంలో ఏర్పాటు చేసి అభిషేకాలు జరిపారు. భక్తులు తనివి తీరా స్వామి అమ్మవార్ల షోడషాభిషేకాలు తిలకించారు. అనంతరం అక్కడ నుంచి స్వామి అమ్మవార్లకు ప్రత్యేకాలంకారం జరిపి బ్రహ్మ గుడి వద్దకు తీసుకువచ్చారు. ఈ ఉత్సవంతో పాటు ఎసి మల్లికార్జున్ ప్రసాద్, ఎఇఓ సతీష్‌మాలిక్, టెంపుల్ ఇన్స్పెక్టర్ సుదర్శనం, నాగ భూషణం, ప్రధానార్చకులు సంబంధం గురుకుల్, ఉప ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్, వేద పండితులు అర్ధగిరి స్వామి, అర్చకులు గోవింద్‌శర్మ ఆలయ సిబ్బంది, వారి సహచరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు,ఇఓ వికె సాగర్‌బాబు,పాలక మండలి సభ్యులు పసల సుమతి, కొండూరు సునీత, రమాప్రభ, లక్ష్మీ, దాసరి జయమ్మ, ప్రత్యేకా హ్వానితులు చింతామణి పాండు, జూలుగంటి సుబ్బారావు, పాలమంగళం రవి, నీలా,శ్రీదేవి, దేవస్థానం అధికారులు ఎసి మల్లికార్జున్ ప్రసాద్, ఎఇఓ సతీష్‌మాలిక్, టెంపుల్ ఇన్స్పెక్టర్ సుదర్శన్, నాగభూషణం, ఆలయ ప్రధానార్చకులు సంబంధం గురుకుల్, ఉప ప్రధానార్చకులు కరుణాగురుకుల్, వేదపండితులు అర్ధగిరిఅర్చకులుగోవింద్‌శర్మ,పట్టణప్రముఖులుహరినాయుడు, రవి భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

## హోరా హోరీగా దక్షిణ భారత వాలీబాల్ పోటీలు

**బంగారుపాళ్యం, జనవరి 21 ప్రభాతవార్త:**




చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో హోరాహోరీగా దక్షిణ భారత వాలీబాల్ పోటీలు జరుగుతున్నాయి. ఈ పోటీలను శుక్రవారం రాత్రి టిటిడి చైర్మన్ వైవి సుబ్బారెడ్డి ప్రారంభించారు. రెండవ రోజైన శనివారం ఈ పోటీలను శనివారం సాయంత్రం ప్రారంభించారు. ఈ వాలీబాల్ పోటీలను చెన్నై బ్లిట్స్ రూపే ప్రైమ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఫ్లడ్‌లైట్ వెలుగుల్లో ఈ పోటీలను చేపట్టారు. శనివారం జరిగిన పురుషుల విభాగం వాలీబాల్ పోటీల్లో కర్నాటక జట్టుపై మద్రాస్ యూనివర్సిటీ జట్టు విజేతగా నిలిచింది. సెట్-5 నందు మూడు సెట్లను మద్రాసు యూనివర్సిటీ జట్టు గెలుపొందగా, కర్నాటక జట్టు కేవలం ఒక సెట్టు మాత్రమే గెలిచింది. ఇరు జట్ల మధ్య హోరాహోరీగా పోటీ జరిగింది. ఈ జట్లు క్రీడాకారులను మాజీ సీనియర్ వాలీబాల్ క్రీడాకారుడు ప్రతాప్‌సేన్, మాజీ ఎఎంసి చైర్మన్ కృపాసాగర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ దత్తాత్రేయరెడ్డిలు పరిచయం చేసుకొన్నారు. అనంతరం మహిళా విభాగంలో ఈరోడ్ మహిళా జట్టు ఎస్ఆర్ఎం మహిళా జట్టు మధ్య పోటీ నిర్వహించారు. ఈ పోటీలను తిలకించడానికి ప్రత్యేకంగా గ్యాలరీలు ఏర్పాటు చేశారు. వాలీబాల్ క్రీడాకారులు, పరిసర గ్రామస్తులు ఈ పోటీలను తిలకిస్తూ కేరింతలు కొట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ కుమార్‌రాజా, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షులు తులసీరెడ్డి, కోశాధికారి మురారి, జిల్లా మాజీ వాలీబాల్ కోచ్ సుదర్శన్‌నాయుడు, వాలీబాల్ క్రీడాకారుడు బాబు, దిలీప్, మురుగేష్, వెంకటేష్, పెరుమాళ్, సింధు, సురేష్, మస్తాన్, మధు, ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఐక్య పోరాటాలతో హక్కులు సాధించుకోగలం : సిపిఐ

**· గూడూరు, జనవరి 21 ప్రభాతవార్త :**



ఐక్య పోరాటాలతోనే హక్కులను సాధించుకోగలమని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి జి.శశికుమార్ అన్నారు. శనివారం గూడూరు పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో జై భారత్ ఆధ్వరత్యంలో ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వివిధ పార్టీలు, ప్రజాసంఘాలు, మైనారిటీ సంఘాల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి పాలనలో దళితులపై దాడులు పెరిగిపోతున్నాయని చెప్పారు. పాలకులు ప్రజలను మతాల పేరుతో విడదీస్తూ వివాదాలకు ఆజ్యం పోస్తున్నారని తెలిపారు. వామపక్షాలు మతాలకు అతీతంగా ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తుంటాయని స్పష్టం చేశారు. వైసీపీ మైనారిటీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మగ్దూమ్ మొహిద్దిన్, బిఎస్‌పి సీనియర్ నాయకులు నాశిన భాస్కర్‌గౌడ్‌లు మాట్లాడుతూ జైభారత్ మంచి ఆశయంతో ముందుకొచ్చిందన్నారు. మైనారిటీ నాయకులు ఎండి అన్వర్‌బాషా మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలలో ఐక్యతతోనే రాజ్యాధికారం సాధ్యపడుతుందన్నారు. ఈ కార్యక్రమానికి షేక్ జమాలుల్లా అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సిహెచ్ ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పరిమళ వెంకటేశ్వర్లు, నాశిన భాస్కర్‌గౌడ్, శ్రీనివాసాచారి, సుబ్బారావు, జైభారత్ గూడూరు శాఖ కార్యదర్శి తలారి నాగరాజు, ఎంబేటి చంద్రయ్య, కరిముల్లా, షేక్ కాలేషా, షేక్ షబ్బీర్, యస్దాని, బిఎస్ఎన్ఎల్ యస్దాని భాయ్, షేక్ హాషిం, షేక్ హాషింభాను, బాబు, ఆర్షద్, బిసి సంక్షేమ సంఘం డివిజన్ కార్యదర్శి ప్రసాద్, ప్రజాసంఘాల రాష్ట్ర నాయకులు ఎల్‌వి సుబ్బయ్య, పలువురు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

## భక్తుల్లో భగవంతుడిని చూడండి



కార్పొరేషన్ ఉద్యోగులకు ఐడి కార్డుల అందజేతలో జెఇఓ సదాభార్గవి, సిఇఓ శేషశైలేంద్ర, పిఆర్ఓ డాక్టర్

***తలారి రవి, ప్రభాతవార్త-తిరుపతి***

## ఇక నెలనెలా హోమాలు,యాగాలు

**తిరుపతి,జనవరి 21ప్రభాతవార్త:**



కపిలేశ్వర ఆలయంలో హోమ మహోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం మహాపూర్ణ హుతితో హోమాలు ముగిశాయి. లోకకల్యాణం కోసం ఇక ప్రతినెలా హోమాలు, యాగాలు నిర్వహించనున్నామని టిటిడి చైర్మన్ వైవి సుబ్బారెడ్డి తెలిపారు. దంపతులతో కలసి ఉదయం కపిలేశ్వర ఆలయంలో హోమం ముగింపులో పాల్గొన్నారు.

## మతిభ్రమించి డిప్యూటీ సిఎం మాటలు

**– జిడినెల్లూరు నియోజకవర్గ 'దేశం' సమన్వయకర్త భీమినేని చిట్టిబాబు**

**పాలసముద్రం, జనవరి 21 ప్రభాతవార్త:**



జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, మాజీ సిఎం నారా చంద్రబాబునాయుడుపై డిప్యూటీ సిఎం నారాయణస్వామి మతిభ్రమించి అవాకులు, చెవాకులు మాట్లాడుతున్నారని జిడినెల్లూరు నియోజకవర్గ 'దేశం' సమన్వయకర్త భీమినేని చిట్టిబాబు ధ్వజమెత్తారు. పాలసముద్రం దేశం కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కందుకురులో మృతి చెందిన కుటుంబాలకు తెలుగుదేశం పార్టీ తరపున ఒకొక్క కుటుంబానికి 24 లక్షల రూపాయలు ఇచ్చారన్నారు. అయితే డిప్యూటీ సిఎం మృతుల కుటుంబాలకు చెల్లని చెక్కులు ఇచ్చారని మతిభ్రమించి ఆరోపణలు చేయడం విడ్డూరంగా వుందన్నారు. పోలీసుల వైఫల్యంతోనే కందుకూరులో ప్రజలు మృతి చెందారని భీమనేని చిట్టిబాబు ఆరోపించారు. వైకాపా దళిత ద్రోహిగా ముద్రపడిందని ఆయన పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ ఎప్పుడు శవ రాజకీయాలు చేయలేదని సిఎం వైఎస్ జగన్ తండ్రి శవం వద్దనే రాజకీయాలు చేశారనే విషయం ప్రజలు మొత్తం చూశారన్నారు. మద్యం ధరలపై ప్రశ్నించిన ఒక దళిత యువకుడిని జిల్లాలో హత్య చేశారని ఆయన ఆరోపించారు. ఈసమావేశంలోదేశంనాయకులుశేఖర్‌రాజు,సాంబశివన్,సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందాలి : ఎమ్మెల్యే

**దొరవారిసత్రం, జనవరి 21 ప్రభాతవార్త :**



అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే, టిటిడి బోర్డు సభ్యులు కిలి వేటి సంజీవయ్య అన్నారు. శనివారం దొరవారి సత్రం మండలం ఆరినేనికండ్రిగ, వెంగమాంబపురం తదితర గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమా న్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మాట్లాడుతూ పార్టీలతో సంబంధం లేకుండా అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం అందించే పథకాలను ఇంటింటా తిరిగి ఇవ్వాల్సిన బాధ్యత అధికారులదే అన్నారు. అనంతరం గ్రామంలోని సమస్యలపై ఆరా తీశారు. తిమ్మానాయుడు కండ్రిగ గ్రామానికి వెళ్లే మార్గంలో కల్వర్టుల నిర్మాణాల కోసం రూ.20 లక్షలు మంజూరుకు అధికారులకు సూచనలిచ్చారు. వెంటనే అధికారులు తగు ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. వీరితో పాటు చెంగాళమ్మ ట్రస్టుబోర్డు చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, వైసీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, మండల వైసీపీ కన్వీనర్ శ్రీనివాసులురెడ్డి, అధికారులు, తహశీల్దార్ గోపినాథ్‌రెడ్డి, ఎంపిడిఓ శింగయ్య, నాయుడుపేట రూరల్ సిఐ వైవీ సోమయ్య తదితరులు ఉన్నారు.

## ప్రజల కోసం మీ ప్రభుత్వం

**తిరుపతి,జనవరి 21ప్రభాతవార్త:**



వందరోజుల గడపగడప కార్యక్రమంలో శనివారం తిరుపతిలో 4వవార్డు శ్రీనివాసపురంలో నాయకులతో కలసి పర్యటించిన యువనేత,ఉపమేయర్ భూమన అభినయ్‌రెడ్డితో సచివాలయం కన్వీనర్ రఘురామ్

## గుండాలకోనలో భారతీయుడు-2 షూటింగ్ సందడి



**రామచంద్రాపురం, జనవరి 21 ప్రభాతవార్త:**

కమల్‌హాసన్, కాజల్ అగర్వాల్ నటిస్తున్న భారతీయుడు-2 సినిమా బలిజపల్లి సమీపంలోని గుండాలకోనలో షూటింగ్ జరుగుతుండటంతో సందడి నెలకొన్నది. అటవీ ప్రాంతంలో సుందరమైన లోకేషన్లు వుండటంతో అనేక సన్నివేశాల చిత్రీకరణకు రెండు నెలలుగా సెట్టింగ్స్‌ను చేశారు. డైరెక్టర్ బి.శంకర్, ప్రొడ్యూసర్ లికా ఆధ్వర్యంలో భారతదేశంలో పూర్వీకుల జీవనశైలి, కట్టుబాట్లను కళ్ళకు కట్టినట్లు చిత్రీకరిస్తున్నారు. ఇందులో పరిసర గ్రామీణప్రాంతాలలో గల చిన్నారులు, మహిళలు, పురుషులను ఎంచుకుని షూటింగ్ చేస్తున్నారు.

## అతివేగం..యమలోకానికి సోపానం:ఉపరవాణా కమీషనరు

**గంగవరం, జనవరి 21, ప్రభాతవార్త :**



అతివేగం యమలోకానికి సోపానంగా మరుతుందని జిల్లా ఉపరవాణా కమీషనరు బసిరెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక మదర్‌తెరిసా ఇంజినీరింగ్ కళాశాలలో కళాశాల అకడమిక్ అడ్వజర్ డా రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో 34వ జాతీయ రహదారి భద్రత వారోత్సవల కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడుతూ పరిమిత వేగం పదిలమని,అతివేగం ప్రమాదకరమని ప్రతి ఇక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించి,ప్రమాదాల నివారణకు సహకరించి విలువైన ప్రాణాలను కాపాడుకోవాలని ఆయన కోరారు.ముఖ్యంగా యువత, విద్యార్థులు ఉత్సాహంతో అతివేగంగా వాహనాలను నడుపుతూ ప్రమాదాల భారినపడి ప్రాణాలను కోల్పోతూ,క్షతగాత్రులుగా మారి తల్లిదండ్రులకు తీరని శోకం మిగుల్చుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎంవిఐ ఆర్‌వి మధుసూధన్,మురళీధర్,పలమనేరు ఎంవిఐ వి.మధుసూధన్, ఆంజనేయ ప్రసాద్,దీపికలతో పాటు సబ్బంది పాల్గొన్నారు.

## ఆలయాల అభివృద్ధికి రూ.20 లక్షలు మంజూరు



**– టిటిడి చైర్మన్ వైవి సుబ్బారెడ్డి**

**బంగారుపాళ్యం, జనదరి 21 ప్రభాతవార్త:**

మండల కేంద్రం బంగారుపాళ్యం లోని రెండు ఆలయాల అభివృద్ధి కోసం 20 లక్షల రూపాయలు మంజూరు చేసినట్లు టిటిడి చైర్మన్ వైవి సుబ్బారెడ్డి చెప్పారు. శుక్రవారం రాత్రి బంగారుపాళ్యం విచ్చేసిన టిటిడి చైర్మన్ వైవి సుబ్బారెడ్డికి మాజీ జడ్పీ చైర్మన్ కుమార్‌రాజా స్వగృహంలో వైకాపా నాయకులు ఘన స్వాగతం పలికారు. బంగారుపాళ్యంలోని రాములగుడి, దళితవాడలోని భజన గుడి అభివృద్ధి పనుల విషయంను మాజీ జడ్పీ చైర్మన్ కుమార్‌రాజా టిటిడి చైర్మన్ వైవి సుబ్బారెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన టిటిడి చైర్మన్ సత్వరం ఒకొక్క గుడి అభివృద్ధికి 10 లక్షల రూపాయలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, సింగిల్‌విండో చైర్మన్ దత్తాత్రేయరెడ్డి, ఎఎంసి చైర్మన్ నారే సోమశేఖర్, మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి, జిల్లా వైకాపా నాయకులు ప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గరుడవాహనంపై దర్శనమిచ్చిన వీరరాఘవులస్వామి

**నారాయణవనం, జనవరి 21 ప్రభాతవార్త :**

మండలకేంద్రంలోని పట్టుశాలీ వీధిలో వెలసిన వేదవల్లి కనకవల్లి సమేత వీరరాఘవులుస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవరోజు శనివారం రాత్రి స్వామి, అమ్మవార్లను గరుడవాహనంలో ట్రాక్టర్‌పై ఊరేగారు. భక్తులు అడుగడుగునా టెంకాయ హారతులు, నైవేద్యం సమర్పించుకున్నారు. అంతకుముందు మధ్యాహ్నం 12గంటలకు అఖండదీపారాధన నిర్వహించారు.

## వైసిపి పాలనలో యువతకు ఉపాధి, ఉద్యోగాలు లేవు : గాలి భానుప్రకాష్



**పుత్తూరు, జనవరి 21 ప్రభాతవార్త :**

రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలో యువతకు ఉపాధి, ఉద్యోగాలు లేవని తెలుగుదేశం పార్టీ నగరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ గాలి భానుప్రకాష్ అన్నారు. శనివారం రూరల్ మండల పరిధిలో తిరుమలకుప్పం, రామసముద్రం పంచాయతీల్లో జరిగిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రెండు పంచాయతీల్లో ప్రజలు పెద్ద ఎత్తున ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా భానుప్రకాష్ మాట్లాడుతూ ప్రతి ఏడాది జనవరిలో ప్రకటిస్తామన్న జాబ్ క్యాలెండర్ ఎక్కడ అని ప్రశ్నించారు. కొత్తగా పరిశ్రమలు రాకపోగా వైసిపి పాలనలో వున్న పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు తరలిపోతున్నాయన్నారు. తెలుగుదేశం పార్టీ పాలనలో ఏ పరిశ్రమ పెట్టాలన్నా ఆంధ్రప్రదేశ్ వైపు చూసిన పారిశ్రామిక వేత్తలు వైసిపి పాలనలో రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పేందుకు భయపడిపోతున్నారని పేర్కొన్నారు. టిడిపి పాలనలో కియా, హీరో, ఇసుజు, అశోక్ లేల్యాండ్, ప్రముఖ మొబైల్ కంపెనీలు పోటీ పడి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చాయని, లక్షలాది మంది యువత ఉపాధి పొందారని తెలిపారు. యువతకు 2 లక్షల, 33 వేల ఉద్యోగాలు ఇస్తామని, డిఎస్సీ నోటిఫికేషన్ ఇస్తామని ముఖ్యమంత్రి ప్రకటించి ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వకుండా మోసం చేశారని ఆరోపించారు. కరెంట్ ఛార్జీలు విపరీతంగా పెరిగిపోయాయని, ఇసుక దొరకకపోవడం, సిమెంట్ రేట్లు పెరగడం వల్ల పేదవాడు ఇల్లు కట్టుకునే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు సమస్యలు చెప్పుకుంటే పరిష్కరించకపోగా... రేషన్ కట్ చేస్తామని, పింఛను పీకేస్తామని బెదిరిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి చిత్తూరు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు గంజి మాధవయ్య, మండల ప్రధాన కార్యదర్శి బాలాజీ, తడుకు సర్పంచ్ బొబ్బిలి, మండల బిసి సెల్ అధ్యక్షుడు మోహన్, తెలుగు రైతు అధ్యక్షుడు ఈశ్వరప్రసాద్, నాయకులు బాలరాజు, శివరాజు, సురేష్, డి.జె.భాస్కర్, రాజశేఖర్, ఆనందయ్య, మాజీ ఎంపిటిసి సుమతి, కైలాసనాయుడు, హేమంత్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమాన్ని గుర్తించండి... మమ్మల్ని ఆశీర్వదించండి

**-ఎంపి గురుమూర్తి,ఎంఎల్ఏ బియ్యపు మధుసూదనరెడ్డి**

**శ్రీకాళహస్తి రూరల్,జనవరి 21 ప్రభాతవార్త :**



కల్లబొల్లి మాటలతో మాయ చేసే మాయగాళ్లు ఎన్నికల సమయంలో వస్తారు. మిమ్మల్ని మాయ చేయటానికి ప్రయత్నిస్తారు. వారి మాటలను నమ్మారో మోసపోతారని తిరుపతి ఎంపి మద్దెల గురుమూర్తి, శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి శనివారం పిలుపు నిచ్చారు. శనివారం వారు 'గడప గడపకు మన ప్రభుత్వం కార్యాక్రమాల్లో పాల్గొన్నారు'.ఈ సందర్భంగా ఏర్పేడు మండలంలోని మడిబాక,రాజుల కండ్రిగ గ్రామాల్లో గడప గడపకు పర్యటించి జగనన్న అమలు చేస్తున్న పథకాలను వివరిస్తూ ఇంకేం కోరుకుంటున్నారని వాకబు చేస్తున్నారు. నిరుపేదల గుండెల్లో గూడు కట్టుకున్న మన సిఎంను మరో సారి గెలిపించుకోవాలంటే మీరందరూ మళ్ళీ ఓట్లు వేయాలని పిలుపు నిస్తున్నారు. బంగారు శ్రీకాళహస్తిగా ఎప్పుడూమీకు అందుబాటులో ఉంటే బియ్యపు మధుసూధనంరెడ్డిని గెలిపించుకోవాలని తిరుపతి ఎంపి మద్దెల గురుమూర్తి ప్రజలకు సూచించారు.శ్రీకాళహస్తి నియోజకవర్గంలో జగనన్న సంక్షేమ పథకాలకు జనం నుంచి విశేష స్పందన వస్తుందని శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి అన్నారు. ప్రభుత్వం ప్రకటించిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాల్లో భాగంగా నియోజకవర్గంలోని గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు.ఆయనకు వైకాపా మండల ఇన్‌చార్జి గున్నేరి కిషోర్‌రెడ్డి సారథ్యంలో జడ్‌పిటిసి మడిబాక సర్పంచ్ చెంగల్‌రాజు,జడ్‌పిటిసి కావేటి తిరుమలయ్య, మండలాధికారులు,సచివాలయ సిబ్బంది ఎంపిడిఓ, వాలంటీర్లు భారీ ఎత్తున స్వాగతం ఏర్పాటు చేసారు. ఇంటింటి వద్ద మహిళలు హారతులిస్తూ స్వాగతం పలికారు. ప్రజలు పూల వర్షంతో ముంచెత్తారు. ఎన్నికలు సమీపిస్తున్నాయి మాయ గాళ్ళు వస్తారు. మభ్యపెడతారు.ఎన్నికలు ముగిసిన తరువాత హైదరాబాదుకు బయలుదేరుతారు. ఎప్పుడూ మీకుఅందుబాటులో ఉంటే నాయకుడు కావాలా? చుట్టపుచూపుగా వచ్చే నాయకులు కావాలో తెల్చుకోవాల్సిన ఎన్నికలు త్వరలో రాబోతున్నాయని చైతన్య పరుస్తున్నారు.

## ప్రజా సంక్షేమమే జగనన్న ధ్యేయం : ఎమ్మెల్యే




**నాయుడుపేట, జనవరి 21 ప్రభాతవార్త :**

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని సూళ్లూరుపేట ఎమ్మెల్యే, టిటిడి బోర్డు సభ్యులు కిలివేటి సంజీవయ్య అన్నారు. శనివారం నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని భూపయ్య కాలనీ సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ కటకం దీపిక, స్థానిక వైసీపీ నాయకులతో కిలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా గడప గడపకు తిరుగుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. మీ ప్రాంతంలో ఏమైనా సమస్యలు ఉంటే చెప్పాలని, వెంటనే పరిష్కరిస్తానని ఆయన తెలియజేశారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలంతా ఆశీర్వదించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కొటాలలో పింక్ బస్ వైద్య శిబిరం విజయవంతం

**తిరుపతినగరం, జనవరి 21 ప్రభాతవార్త:**

స్విమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం, కోటాల గ్రామ నందు ప్రత్యేకించి మహిళల కోసం 130వ పింక్ బస్ క్యాన్సర్ వైద్య శిబిరం నిర్వహించినట్లు డాక్టర్ రామ్ తెలిపారు. ప్రధానంగా మహిళలకు ఉచిత క్యాన్సర్ వ్యాధి నిర్ధారణకై మహిళా వైద్య సిబ్బందిచే నిర్వహిస్తున్న పింక్‌బస్ క్యాంప్‌ను ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అభ్యర్థనమేరకు కొటాల నందు నిర్వహించామన్నారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 45 మంది మహిళలకు పింక్ బస్ ద్వారా క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ పరీక్షణ మామోగ్రఫీ, అల్ట్రాసౌండ్, పాప్ స్మియర్, ఒరల్ పరీక్షలను ఉచితంగా నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో కొటాల ఎంపిటిసి వి.మధు, సర్పంచ్ వి.గంగులమ్మ,



కొటాల పిహెచ్‌సి డాక్టర్ శివాజీ, ఎంపిహెచ్ఓ ఈశ్వర్య, రఘు, శ్యామలమ్మ, స్విమ్స్ వైద్యులు డాక్టర్లు వి.పూజ, అశ్రిత, మంజుష, భానురేఖ, బి.వి.ప్రీతి, ఎ.వి.చైతన్య భాను, భార్గమి, లావణ్య, ఎ.డి(పిఆర్)బి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

**స్విమ్స్‌లో ఇక ప్రతిరోజు ఆంకాలజీ ఓపి సేవలు :**

స్విమ్స్ హాస్పిటల్ నందు ఇకపై ప్రతిరోజు ఆంకాలజీ (క్యాన్సర్) వైద్య సేవలు ప్రతిరోజు నిర్వహించబడునని స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ ఓ ప్రకటనలో తెలిపారు. రోజురోజుకు పెరుగుతున్న క్యాన్సర్ రోగులకు అనుగుణంగా మెడికల్ ఆంకాలజీ, సర్జికల్ ఆంకాలజీ, రేడియేషన్ ఆంకాలజీ వైద్య సేవలు సోమవారం నుండి శనివారం వరకు శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల ఆసుపత్రి నందు నిర్వహించబడున్నారు. ఉదయం 7గంటల నుండి 11గంటల వరకు ఓపి వుంటుందన్నారు.